


**పేపరులోని ఆ ప్రకటనని ... నిశ్చింతగా గమనించాడు. తను చేయ బోతున్న పని తనకు పెద్దగా కష్టం కపోయినా, తల్లిదండ్రులకు వయసు కు మించిన పనిగా కనిపిస్తుంది. స్నే హితులకు ఆదర్శంగా అనిపిస్తుంది.**

నిజానికి తను వయసుకి మించిన పని 'అడ్వెంచర్' పేరుతో చెయ్యాలనీ, ఆదర్శం కోసంగానీ ఈ పని చేయాలనుకోవడం లేదు.

తనకిప్పుడు డబ్బు అవసరం అంతే!

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. తల్లీదండ్రీ, చెల్లెళ్ళూ, తమ్ముడూ హాయిగా నిద్రపోతున్నారు.

అవును మరి! వాళ్ళకే చీకూచింతా లేదు.

కుటుంబంలో పెద్దవాడుగా పుట్టి, చిన్నప్పుడు సర్వ రాజభోగాలూ అనుభవించినందుకు సంతోషించాలో, వయసు మీదపడి కుటుంబ బాధ్యతలు తన మీద పడ్డందుకు విచారించాలో క్షణకాలం అతనికి తోచ లేదు. ఈ ప్రపంచంలోని ప్రతి పెద్ద కుటుంబం కష్టాలు, కన్నీళ్ళూ, సుఖాలూ, భోగాలూ కలిపి సృష్టించిన ఒక మహా సముద్రం. క్షీరసాగరం అనే కుటుంబం.

పాలలాగా కనపడే సుఖ భోగాలు.

నీటిలాగా కనిపించకుండా దానితో చేరి జీవులని మభ్యపెట్టే కష్టాలు అన్నీ ఈ కుటుంబమనే సాగరంలో మిళితమై ఉన్నాయి. కుటుంబ పెద్ద తన శ్రమతో ఈ క్షీరసాగరాన్ని చిలికితే, వచ్చే పాలూ, వాటితో కలిసిన నీళ్ళూ కుటుంబ సభ్యులందరికీ పోగా, చివరికి అతనికి మిగిలేది విషం, నికృష్టపు బ్రతుకు మాత్రమే.

అమ్మకి చెప్తే శోకాలు పెడ్తుంది.

నాన్న, "నేను చచ్చిపోయాననుకున్నావురా?" అంటూ ఆవేశపడిపోతాడు. అలా అని తన కోసం ఈ సాహసం చెయ్యట్లేదు తను.

పెద్ద చెల్లెలు గిరిజ అందగత్తె కాకపోవడం, పేద కుటుంబంలో పుట్టడం మొదటి బాధైతే, పెళ్ళిచూపు లంటూ వచ్చి, "అసలు మేము పిల్లని చూడటానికి కాదూ, తినటానికొచ్చాము"నేలా ప్రవర్తించి, ఏదో ఒకటి చెప్పాలి కాబట్టి.

"పిల్ల నచ్చలేదంటారు" అది తిండి తినే ముందే ఎందుకు గుర్తురాదో!

ఇక చిన్న చెల్లెలు లలితకి ఫ్యాషన్ల పిచ్చి.

**కాశీవఝల శారద**

ఇక తమ్ముడికేమో పుస్తకాలు, స్నేహితులు, సినిమాలు తప్ప వేరే ధ్యాస లేదు. ఈ పుస్తకంతే, ఆ పుస్తకంతే అంటూ సణగడం, తండ్రి కసిరితే అంత మాత్రానికే ఆ రోజు తిండి మానెయ్యడమో, ఇల్లు వదిలి పారిపోవడానికి ప్రయత్నించడమో!

తల్లి రోగంతో మంచంలో పడుంటుంది. అరిచే ఓపికే ఉండదు. తండ్రి రిటైరై మూడు సంవత్సరాలవుతున్నా పెన్షన్ డబ్బు ఇప్పటివరకూ చేతికంద లేదు.

ఆలోచిస్తున్న కొద్దీ కళ్యాణ్‌కి "ఈ ఇంట్లో ఏ దుర్గుణం లేనివాడిని నేనొక్కడినే" అనిపించింది. చిన్నగా నవ్వుకున్నాడు.

సమయం రాత్రి పదకొండు గంటలైంది. తను రాయదల్చుకున్నదేదో రాసి టేబుల్ ల్యాంప్ కింద పెట్టి, బ్యాగ్‌లో బట్టలు సర్దుకుని ఇంట్లోంచి బయట పడ్డాడు. కొంచెం సేపు ఆ ఇంటిని పరికించి ముందుకి సాగాడు కళ్యాణ్.

** ** **

మర్నాడు పొద్దున్నే రామారావుగారు "ఏమేవ్! కళ్యాణ్ ఎంత పనిచేశాడో చూశావా! ఎవ్వరికీ చెప్పకుండా తన ఇష్టం వచ్చిన పని చేసేటంత గొప్పవాడైపోయాడే! వీడొక్కడే మహా దాత అయినట్టు వాడి మూత్రపిండాలు రెండూ దానమివ్వడానికి సిద్ధపడ్డాడే!" ఆయన కళ్ళు వర్షిస్తున్నాయి.

భార్య నుంచి ఏ జవాబూ రాకపోవడంతో దగ్గరికి వెళ్ళి చూశాడు. అరిచేందుకు తెరిచిన ఆమె నోరు అలాగే ఉండిపోయింది.

అందరూ నిశ్చేష్టులై అచేతనంగా నిలబడిపోయారు.

** ** **

నాలుగు రోజుల తరువాత ఒక స్నేహితుడి సాయంతో కారులోంచి దిగుతున్న అన్నయ్యని చూసి లలిత ఏడుస్తూ వెళ్ళి గుండెమీద వాలిపోయింది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉండడం కళ్యాణ్‌కి ఆశ్చర్యమనిపించింది. గిరిజ కేకలూ, అమ్మ అరుపులూ, దగ్గు ఏమీ వినిపించడం లేదు. తండ్రి, తమ్ముడు మాత్రం చేష్టలుడిగి నుంచున్నారు.

కళ్యాణ్‌ని చూడగానే వారి కళ్ళు అప్రయత్నంగా కన్నీరు కార్చాయి. కళ్యాణ్ స్నేహితుడు రమణ వాళ్ళని సముదాయిస్తూ "వాళ్ళు రెండూ తీసుకోవడానికి కుదరదని, ఒకటే తీసుకున్నారండీ! ఈ సంగతి నాకు తెలిసినా, మీకు చెప్పకూడదని నా దగ్గర ప్రమాణం చేయించుకున్నాడు" అంటూ తల వంచుకున్నాడు.

లలిత ఏడుస్తూ అసలు విషయం చెప్పింది.

కళ్యాణ్ వెళ్ళాడన్న బాధతో తల్లి కన్ను మూయడం, తన పెళ్ళి మూలానే అన్నయ్య ఈ సాహసాన్ని తలపెట్టినందుకు గిరిజ ఆత్మహత్య చేసుకోవడం.

కళ్యాణ్ గుండె జారిపోయింది.

తను ఇంత కష్టపడిందీ ఈ మాట వినడానికా?

"అన్నయ్యా! నేనూ, తమ్ముడూ బాగా చదువుకుంటాం. నువ్వు పడ్డ ఈ శ్రమకి ఫలితాన్ని తప్పకుండా పొందుతావు. ఈ విషయం వదినకి తెలిస్తే బాధపడ్తుందనేనా కావాలని దెబ్బలాడి పుట్టింటికి పంపేశావు. నువ్వు దేవుడివన్నయ్యా! మమ్మల్ని క్షమించు" అంటూ కాళ్ళకు చుట్టుకుపోయిన చెల్లెల్నీ, తమ్ముణ్ణీ నెమ్మదిగా లేపి ముద్దు పెట్టుకున్నాడు.

"నాకు మిగిలిన మిమ్మల్నైనా కాపాడుకుంటాను" మనసులో అనుకున్నాడు కళ్యాణ్.

రమణ, రామారావుగారూ కళ్ళుతుడుచుకున్నారు.